క్లుప్తంగా

నేడు భైరవపాలెంలో ఎమ్మెల్యే పర్యటన

ఐ.పోలవరం: మండలంలోని తీరప్రాంత గ్రామమైన భైరవపాలెంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం పర్యటించి నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాలు, వాటర్ ట్యాంకు తదితర అభివృద్ధి పనుల్ని ప్రారంభించనున్నారని పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్సీ త్రిమూర్తులును కలిసిన చాంబర్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును అమలాపురం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మండపేటలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి నాగా వెంకటేశ్వరరావు తదితరులు ఎమ్మెల్సీ త్రిమూర్తులను కలిసి సత్కరించారు.

సౌర కుటుంబం నాణేల సేకరణ



కృష్ణ కామేశ్వర్ సేకరించిన సౌర కుటుంబంలోని గ్రహాల నాణేలు

అమలాపురం టౌన్: సౌర కుటుంబంలో ఉన్న తొమ్మిది గ్రహాలతో కూడిన పది నాణేలను అమలాపురానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. టర్కీ దేశం ముద్రించి విడుదల చేసిన ఈ అల్యూమినియం నాణేలను కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై తెప్పించారు. సూర్యుడు, సౌర కుటుంబంలో ఉండే బుధుడు, శుక్రుడు, భూమి, కుజుడు, గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో తదితర నాణేలున్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఏవోగా శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)గా కాండూరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ అయినవిల్లి మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు పదోన్నతిపై డివిజన్ కార్యాలయం ఏవోగా బదిలీ అయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్‌ఈఈ, ఈఈ సీహెచ్‌ఎన్‌వీ కృష్ణారెడ్డిని అమలాపురంలో శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి తన జాయినింగ్ రిపోర్టును అందజేసి విధుల్లో చేరారు.

కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

అల్లవరం: ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా అన్ని పశు వైద్యశాలల్లో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు ఏడీ ఎల్. విజయరెడ్డి బుధవారం తెలిపారు. రేబిస్ వ్యాధి అతి భయంకరమైనదని, దానికి చికిత్స లేదన్నారు. ముందస్తుగా పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

నీట్ యూజీ ఎంబీబీఎస్ జాబితా విడుదల

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లకు సంబంధించి నీట్ ఎంబీబీఎస్ 2023-24 స్టేట్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు హెల్త్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఫలితాలను వెబ్‌సైట్‌లో చూసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలుంటే పది రోజుల్లో డైరెక్టర్ హెల్త్ కమ్ నోడల్ ఆఫీసర్(మెడికల్ ఎడ్యుకేషన్), డీహెచ్‌ఎఫ్‌డబ్ల్యూఎస్‌కు సంబంధిత డాక్యుమెంట్లతో తెలపాలని కోరారు.

స్థానికంగానే రేషన్ ఇచ్చే ఏర్పాటు చేస్తాం

అల్లవరం: బోడసకుర్రు టిడ్కో లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి బోడసకుర్రు పంచాయతీ పరిధిలో రేషన్ ఇచ్చే ఏర్పాటు చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాలాధికారి ఎ.పాపారావు తెలిపారు. బోడసకుర్రు టిడ్కో భవనాల్లో నివాసముంటున్న 342 కుటుంబాలను బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని వలంటీర్లకు బదలాయించేందుకు బుధవారం సర్వే నిర్వహించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన పారా లీగల్ వలంటీర్ల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో ముగింపు కార్యక్రమంలో రహంతుల్లా మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై పారా లీగల్ వలంటీర్లు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్‌వీ ప్రసాదరావు, న్యాయవాదులు దాసరి సత్యనారాయణ, కోన వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుకు వ్యతిరేకం

యానాం: నియోజకవర్గ పరిధిలోని గోపాల్‌నగర్‌లో కొత్తగా డంపింగ్‌యార్డు పెట్టడానికి ప్రభుత్వం నిర్ణయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు గోపాల్‌నగర్ గ్రామస్తులు, నాయకులు ఆర్‌ఏఓ మునిస్వామికి బుధవారం వినతి పత్రం సమర్పించారు.

అమ్మ ఒడి.. భవితకు పునాది

- విద్యార్థుల తల్లుల ఖాతాలకు అమ్మ ఒడి సొమ్ములు జమ
- అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో లబ్ధిదారులు 47,099 మంది



అల్లవరం: పేద కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించాలనే సమున్నత లక్ష్యంతో ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది. పేదరికంతో మధ్యలోనే చదువు నిలిచిపోకుండా అమ్మ ఒడి పథకంతో వారి చదువులకు భరోసా కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదివే విద్యార్థులకు అమ్మ ఒడి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతుంది. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు ఏటా రూ.15 వేల నగదుని జమ చేస్తుంది. అమ్మ ఒడి పథకం తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగో విడత సొమ్ములు జమ

అమ్మ ఒడి పథకం ద్వారా ఇప్పటి వరకూ మూడు విడతల్లో విద్యార్థులకు లబ్ధి చేకూర్చారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత అమ్మ ఒడి పథకాన్ని గత నెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించి విద్యార్థుల తల్లుల ఖాతాలకు నేరుగా డబ్బులను జమ చేశారు. పాఠశాలల్లో డ్రాఫ్ అవుట్స్ నివారించడం, నిరుపేదలకు నాణ్యమైన విద్య, పాఠశాలల్లో హాజరు శాతం పెంచడంలో అమ్మ ఒడి పథకం మంచి ఫలితాలు సాధించింది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో అమ్మ ఒడి పథకం ద్వారా 47,099 మంది విద్యార్థుల తల్లులకు రూ.70,64,85,000 నగదుని జమ చేశారు. దీంతో తల్లిదండ్రుల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో అమ్మ ఒడి పథకం లబ్ధి వివరాలు

మండలం	విద్యార్థులు	జమ చేసిన అమ్మ ఒడి నగదు (రూ.ల్లో)
అల్లవరం	5,475	8,21,25,000
అమలాపురం	10,148	15,22,20,000
ఉప్పలగుప్తం	5,197	7,79,55,000
ముమ్మిడివరం	5,496	8,24,25,000
ఐ.పోలవరం	5,873	8,80,95,000
కాట్రేనికోన	6,647	9,97,20,000
తాళ్లరేవు	8,263	12,39,45,000
మొత్తం	47,099	70,64,85,000

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మా అమ్మాయి కండిబోయిన చరిష్మా కొమరగిరిపట్నం శివారు రాజుపాలెం ఎంపీపీ పాఠశాలలో మూడో తరగతి చదువుతుంది. అమ్మ ఒడి పథకం ద్వారా మా పిల్లల చదువుకి భరోసా లభిస్తుంది. ఇప్పటివరకూ అమ్మ ఒడి ద్వారా మూడుసార్లు లబ్ధి పొందాం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– కండిబోయిన దుర్గాభవాని, కొమరగిరిపట్నం

నాలుగుసార్లు లబ్ధి పొందాను



మా అమ్మాయి బొంతు హర్షిత అల్లవరం గోసంగివారిపేటలోని ఎంపీపీ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుంది. అమ్మ ఒడి పథకంలో నాలుగు సార్లు లబ్ధి పొందాను. అమ్మ ఒడి కారణంగా పేదరికంతో పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోతాయన్న భయం లేదు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.
– బొంతు నాగలక్ష్మి, గోసంగి వారిపేట, అల్లవరం

బాగా చదివించుకుంటున్నాం



మా అబ్బాయి మల్లాడి గిరి రాజేంద్ర వరప్రసాద్ ఎస్.కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇప్పటివరకూ మూడు సార్లు అమ్మ ఒడి నగదు జమైంది. అమ్మ ఒడితో మా పిల్లల్ని బాగా చదివించుకుంటున్నాం. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులను వారి చదువులకే కేటాయిస్తున్నాం.
– మల్లాడి మంగ, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

గడప గడపకూ సంక్షేమ పథకాలు



సవరప్పాలెంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: నాలుగేళ్ల పాలనలో గడప గడపకూ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సవరప్పాలెంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి వివరాలున్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలేవీ చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు మెసలి స్పర్జన్ రాజు, ఎంపీటీసీ రేవు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట



బండారులంకలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని బండారులంక సచివాలయం-1 పరిధిలోని నారాయణరావుపేట, దంగేటివారిపాలెం, మర్రిపుంతల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమం ద్వారా ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు నిధులిచ్చి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఒకపక్క సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలుచేస్తూనే మరోవైపు అభివృద్ధికి పెద్దపీట వేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, సొసైటీ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకిలక్ష్మి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ళ రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, మండల సచివాలయాల కన్వీనర్ చొల్లంగి సుబ్బరామ్, నాయకులు గుత్తుల సత్తిబాబు, ముషిని నాగరాజు పాల్గొన్నారు.

సురక్షతో సమస్యల పరిష్కారం

అమలాపురం టౌన్: జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజా సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి అన్నారు. పట్టణంలోని మద్దాలవారిపేట, మహిపాల వీధి వార్డు సచివాలయాల పరిధిలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి పాల్గొని ప్రసంగించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో సాంకేతిక ఇబ్బందులతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న అర్హులను గుర్తించి వారికి అవసరమైన ధ్రువపత్రాలన్నీ అందజేస్తున్నామని ఆమె చెప్పారు. చైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు వాసంశెట్టి కృష్ణకుమారి, నాగారపు వెంకటేశ్వరరావు, గొలకోటి విజయలక్ష్మి, కొల్లాటి దుర్గాబాయి పాల్గొని సురక్ష ద్వారా మంజూరైన ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేశారు. మొత్తం 428 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కాగా 450 దరఖాస్తులను పరిష్కరించి లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ మేనేజర్ ఎంవీఎస్ఎన్ మూర్తి, టీపీవో ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

అల్లవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ కార్యదర్శులను ఆదేశించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 27 వరకూ జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీఓ సూచించారు. గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయ, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌పై దృష్టి పెట్టాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ సాంబశివ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాలు, తుఫాన్ల ప్రభావం మండలంపై ఉంటుందని అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఏఈ స్వామి, జేఈ సంపన్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఏఓ లక్ష్మణరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి



ఉప్పంగలలో లబ్ధిదారుకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తాళ్లరేవు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలుచేస్తుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. బుధవారం ఉప్పంగల పంచాయతీలో సర్పంచ్ శాఖ శంకరుడు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి జగనన్న సురక్ష ద్వారా పరిష్కారం చూపిస్తున్నారన్నారు. అనంతరం 520 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ ఎం.అనుమప, ఉప్పంగల, లచ్చిపాలెం గ్రామ కమిటీ కన్వీనర్లు దవులూరి శ్రీరామ్మూర్తి, అనిశెట్టి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కొప్పిగుంటలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొప్పిగుంటలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని కొప్పిగుంట గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ పుట్టే బిడ్డ దగ్గర నుంచి పండు ముదుసలి వరకూ అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. బడికి వెళ్తున్న చిన్నారుల తల్లి బ్యాంకు ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమ చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా రావాలంటే రెండోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేయవలసిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కొప్పిగుంట గ్రామానికి రక్షిత మంచి నీటిని అందించేందుకు సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు, వాణిజ్య విభాగం జిల్లా చైర్మన్ సంసాని నాగేశ్వరరావు, సర్పంచ్ కముజు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ మోత రామలక్ష్మి, నాయకులు పాలెపు ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, నడింపల్లి సూరిబాబు, వనచర్ల వెంకటేశ్వరరావు, బడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి మహోత్సవాలు



వారాహి అఖండ హోమానికి మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో గత 16 రోజులుగా జరుగుతున్న వారాహి అఖండ హోమ మహోత్సవాలు బుధవారం తెల్లవారుజామున నిర్వహించిన మహా పూర్ణాహుతితో ముగిశాయి. వారాహి అమ్మవారి సామూహిక మంత్ర జపంతో భక్తులు వివిధ రకాల ద్రవ్యాలను హోమంలో వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అక్షయ పాత్ర అధ్యక్షుడు పోతురాజు రామకృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు, ప్రముఖులు హాజరయ్యారు. మహోత్సవాలకు అక్షయ పాత్ర భక్తులు లింగోలు విస్సు, శిరీష దంపతులు రూ.20 వేలు, భూసారపు శ్రీనివాస్ రూ.10 వేలు, రుద్రరాజు బంగార్రాజు రూ.8 వేలు, అరిగెల వెంకట నాగేశ్వరరావు రూ.8 వేలు, సలాది సాయిరామ్ రూ.8 వేల వంతున విరాళాలు సమకూర్చారు.

146 యూడీసీ కొత్త ఖాళీలు సైతం భర్తీ

యానాం: గతేడాది సెప్టెంబర్‌లో విడుదల చేసిన 116 యూడీసీ పోస్టుల నోటిఫికేషన్‌కు కొనసాగింపుగా కొత్తగా మరో 146 పోస్టులను సైతం భర్తీ చేయనున్నట్లు పరిపాలనా సంస్కరణల కార్యదర్శి జయశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన నోటిఫికేషన్‌లో ఓసీ-59, ఎంబీసీ-26, ఎస్సీ-23, ఓబీసీ-16, ఈడబ్ల్యూఎస్-14, ఈబీసీ-3, బీసీఎం-3, బీటీ-1, ఎస్టీ-1, ఎక్స్ సర్వీస్‌మెన్-14, పీడబ్ల్యూడీ-5, ఎంఎస్‌పీ-7 పోస్టులను కేటాయించారు. పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా 116 పోస్టులు భర్తీ చేసిన వెనువెంటనే కొత్త ఖాళీలు 146 సైతం దశలవారీగా ప్రత్యేక నూతన జాబితా ఆధారంగా భర్తీ చేస్తారన్నారు.

ఎంపీపీ పరామర్శ

తాళ్లరేవు: పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న పటవల పంచాయతీ ఈబీసీ కాలనీకి చెందిన కౌలు రైతు బావిశెట్టి శ్రీనివాసరావు కుటుంబాన్ని ఎంపీపీ రాయుడు సునీత బుధవారం పరామర్శించారు. మృతుని భార్య గంగాభవాని, కుమారులను పరామర్శించి ఓదార్చారు. రైతు మృతి చెందిన విషయాన్ని ఎంపీపీ సునీత ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఫోన్‌లో తెలియజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

పదోన్నతి పరీక్ష వాయిదా

యానాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎల్‌డీసీలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు అసిస్టెంట్‌లుగా పదోన్నతికి జులై 16న నిర్వహించాల్సిన డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌ను ఆగస్టు 6వ తేదీ ఆదివారానికి వాయిదా వేస్తున్నట్లు బుధవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు హాల్ టికెట్లు త్వరలోనే పంపిస్తామని చెప్పారు.

పూడికతీత పనులకు శ్రీకారం

ఉప్పలగుప్తం: రంగరాజుకోడు(మీడియం) డ్రైయిన్‌లో పూడికతీత కోసం బుధవారం స్థానిక రైతులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రంగరాజుకోడులో 6.2 కి.మీ. మేర డ్రెయిన్‌లో మేటలు వేయడంతో ఏటా తొలకరి పంటలో వరి చేలల్లోని ముంపు నీరు దిగక సుమారు 6 వేల మంది రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో సీఎస్ఆర్ నిధులు రూ.94 లక్షల వ్యయంతో కూనవరం మేజర్ డ్రెయిన్ వరకూ పూడికతీత పనులకు అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, సన్నవిల్లి సర్పంచ్ చిక్కం పెదబాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు

అమలాపురం రూరల్: రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో గృహనిర్మాణ శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ సీహెచ్ బాబూరావు ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, చదరంగం వంటి పలు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ కె.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి వ్యాను బోల్తా

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో కోరంగి పోలీస్‌స్టేషన్ సమీపంలో లోడుతో వెళుతున్న వ్యాను బుధవారం బోల్తా పడింది. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుంచి యానాం వైపు వెళుతున్న వ్యాను అత్యంత వేగంగా వచ్చి ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. వ్యాను క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రహదారి చెంతన ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో జి.వేమవరం జాంకాయల తూము వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన మల్లాడి మోహన్, పెమ్మాడి సతీష్‌లు మోటార్‌సైకిల్‌పై కాకినాడ వైపు వెళుతూ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యానును ఢీకొట్టారు. ప్రమాదంలో మోహన్‌కు కాలు విరిగింది. క్షతగాత్రులను 108లో కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

వీఓఏ కనకదుర్గ అరెస్ట్

అమలాపురం రూరల్: అమలాపురం మండలం పేరూరు గ్రామం చింతపల్లివారిపాలెం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెందిన స్త్రీనిధి, ఉన్నతి, పొదుపులకు సంబంధించిన సొమ్మును దుర్వినియోగం చేసిన కేసులో నిందితురాలు వీఓఏ నెల్లి కనకదుర్గను అరెస్టు చేసినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ బుధవారం తెలిపారు. నిందితురాలిని బుధవారం స్థానిక కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆమెను రాజమహేంద్రవరం మహిళా జైలుకు తరలించామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

అమలాపురం టౌన్: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు పాటుపడాలని డీఈవో ఎం.కమలకుమారి సూచించారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ ఎనర్జీ కంజర్వింగ్ హోమ్స్ అండ్ ఆర్గనైజింగ్స్(ఈఎఫ్ఈసీహెచ్‌వో) కార్యక్రమాన్ని డీఈవో కమలకుమారి బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి పాఠశాలలో ఈఎఫ్ఈసీహెచ్‌వో కార్యక్రమాలను విద్యార్థులతో విధిగా నిర్వహించాలన్నారు. అనంతరం డీఈవో కమలకుమారి ఈఎఫ్ఈసీహెచ్‌వో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.కామేశ్వరరావు పాల్గొన్నారు.